క్లుప్తంగా

26 నుంచి ఉర్సు ఉత్సవాలు

ఆదిలాబాద్‌టౌన్: చాందా దర్గా ఉర్సు ఉత్సవాలను ఈనెల 26 నుంచి ప్రారంభించనున్నట్లు దర్గా కమిటీ అధ్యక్షుడు మహ్మద్ అష్రఫ్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. 26న సాయంత్రం జిల్లా కేంద్రంలోని జామా మస్జిద్ నుంచి షాహి సందల్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. 28న చాందా దర్గాలో మహిఫిలే సమ ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో ఖాజా సిరాజొద్దీన్, మహ్మద్ అబుజర్, ఖయ్యూం రజా, ఖాదిం షేక్ షహిన్‌షా, జాకిర్ మౌలాన, ఫసహత్ అలీ, హబీబ్, కరీం, షేక్ తాజ్ అలీ, అయ్యుబ్ ఖాన్ పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

నేరడిగొండ: పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జీసీడీవో మెస్రం ఛాయ అన్నారు. బుధవారం మండలంలోని లఖంపూర్ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. మొదటి రోజు జరిగిన పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ చదువుతోనే సమాజంలో గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం బోర్డుపై విద్యార్థులకు పాఠాలు బోధించారు.

ఆహార భద్రత చట్టంపై అవగాహన ఉండాలి

తలమడుగు: ఆహార భద్రత చట్టంపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి క్షమదేశ్‌పాండే అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రజలకు ఆహార భద్రత, చట్టాలపై అవగాహన కల్పించారు. ఆర్థికంగా వెనకబడిన ప్రజలకు ఆకలితో అలమంటించకూడదని 2013లో ఈచట్టాలన్ని తీసుకురావడం జరిగిందన్నారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ గంగారాం, ఈశ్వర్‌రెడ్డి, అశోక్, ఉమేష్‌రావు, ఎంపీపీ కల్యాణం లక్ష్మి, సంతోష్, ఎంపీవో దీలిప్, సర్పంచ్ కరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు.

కొనసాగుతున్న హాథ్‌సే హాథ్‌జోడో యాత్ర

ఆదిలాబాద్‌టౌన్: హాథ్‌సే హాథ్ జోడోయాత్ర ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్‌కే కాలనీలో కొనసాగుతోంది. బుధవారం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించి, కాంగ్రెస్ డిక్లరేషన్ కరపత్రాలు పంపిణీ చేశారు. సాజిద్‌ఖాన్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో బీజేపీ, బీఆర్‌ఎస్ హామీలు ఇచ్చి నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే నిత్యావసర వస్తువుల ధరలను తగ్గిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యురాలు గండ్రత్ సుజాత, నాయకులు సంజీవ్ రెడ్డి, నగేష్, వసీమ్, షాకిర్, అమీర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై ప్రజలు చర్చించాలి

కైలాస్‌నగర్: తెలంగాణ రాష్ట్రం రాక ముందు, వచ్చాక జరిగిన అభివృద్ధి పనులపై ప్రజలు చర్చించాలని ఎమ్మెల్యే జోగు రామన్న సూచించారు. ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలోని రణదీవేనగర్ కాలనీలో రూ.30లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీరోడ్లు, డ్రెయినేజీ పనులకు బుధవారం భూమిపూజ చేశారు. పనులకు సంబంధించిన శిలఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 400 మంది లబ్ధిదారులకు ఆసరా పెన్షన్ మంజూరు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, కమిషనర్ శైలజ, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అజయ్, కౌన్సిలర్ కోవ రవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రేమికుల ఆత్మహత్యాయత్నం

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామంలో ప్రేమజంట ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించారు. మంగళవారం అర్ధరాత్రి పశువుల కొట్టంలో ప్రేమికులిద్దరు పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. గత కొంత కాలంగా గ్రామానికి చెందిన యువతీ, యువకుడు ఒకరిని ఒకరూ ప్రేమించుకుంటున్నారు. ఈక్రమంలో కులాలు వేరు కావడంతో తమ పెళ్లికి పెద్దలు అంగీకరించరని, పురుగుల మందు తాగారు. స్థానికులు గమనించి జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం రిమ్స్ ఆస్పత్రిలో యువతీ, యువకుడు చికిత్స పొందుతున్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆదిలాబాద్: క్రీడాకారులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఒలింపిక్ అసోసియేషన్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు బాలురి గోవర్ధన్ రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో బుధవారం నిర్వహించిన అథ్లెటిక్స్ జిల్లాస్థాయి ఎంపిక పోటీలను ప్రారంభించారు. ఈనెల 25, 26 తేదీల్లో నల్లగొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారధి, పీఈటీలు రాజేశ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఊరూరా బెల్ట్‌షాప్‌లు

- మామూళ్ల మత్తులో పోలీసులు
- మద్యానికి బానిస అవుతున్న యువత


నిరాల గ్రామంలో ఏర్పాటు చేసిన బెల్ట్‌షాప్

జైనథ్: మండలంలో మద్యం ఏరులై పారుతుంది. ఊరూరా బెల్ట్‌షాప్‌లు ఏర్పాటు చేసి అధిక ధరలకు అమ్ముతున్నారు. మండల కేంద్రం, భోరజ్ గ్రామంలోని వైన్స్‌షాప్‌ల నుంచి ప్రతీరోజు బెల్ట్‌షాపులకు హోల్‌సెల్ మద్యం సరఫరా అవుతోంది. చిన్నచిన్న గ్రామాల్లో సైతం బెల్ట్‌షాప్‌లకు రూ. లక్షల్లో వేలం వేసి దక్కించుకుంటున్నారు. బెల్ట్‌షాప్‌లకు పోటీ విపరీతంగా ఉండడంతో చాలా గ్రామాల్లో వీడీసీ (విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీలు) ప్రత్యక్షంగా రంగంలోకి దిగి, నిర్వహణకు అనాధికారిక అనుమతులు ఇస్తున్నారు. రాత్రి మద్యం విచ్చలవిడిగా లభిస్తుండటంతో యువత మద్యానికి బానిసవుతున్నారు. దీంతో కుటుంబ కలహాలు, క్షణికావేశం ఆత్మహత్యలు, నేరాలు పెరుగుతున్నాయి.

వీడీసీలదే ఇష్టారాజ్యం..

చాలా గ్రామాల్లో బెల్ట్‌షాప్‌ల వేలం పాట, అనాధికారిక అనుమతులు, నిర్వహణ, పోలీసులను మేనేజ్ చేయడం మొత్తం వీడీసీలే చూసుకుంటున్నాయి. గ్రామ అభివృద్ధి కోసం అనే సాకుతో గ్రామాల్లో బెల్ట్ షాప్‌లకు అనుమతులు ఇస్తుండడంతో బెల్ట్‌షాప్‌లు కోకోల్లలుగా వెలిశాయి. మండలానికి ఒకటి, రెండు వైన్‌షాప్‌లు ఉంటే, గ్రామాల్లో ప్రతీరోజు మద్యం సులువుగా దొరకక, మందు బాబుల సంఖ్య తగ్గే అవకాశం ఉంటుంది. దీంతో ఎన్నో జీవితాలు నిలబడతాయి. కానీ బెల్ట్‌షాప్‌ల వలన ఇంటి వద్దనే మద్యం లభిస్తుండడంతో మందుబాబులు తాగుడుకు బానిసవుతున్నారు.

కన్నెత్తి చూడని పోలీసులు..

మండలంలో ఒకటి, రెండు గ్రామాల్లో మినహా అన్ని గ్రామాల్లో బెల్ట్‌షాప్‌లను నడిపిస్తున్నారు. వీటిలో కేవలం తెలంగాణ మద్యం మాత్రమే కాకుండా, నిషేధిత మహారాష్ట్ర దేశీదారు కూడా విక్రయిస్తున్నారు. మండలంలోని పెన్‌గంగ తీరంలోని కొన్ని గ్రామాలు మహారాష్ట్రతో సరిహద్దు ఉండడంతో దేశీదారు అక్రమ రవాణా సులభంగా జరుగుతుంది. లా అండ్ ఆర్డర్ పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు అడపదడపా కేసులు చేస్తున్నా.. కూడా గ్రామాల్లో బెల్ట్ షాప్‌లను బహిరంగానే నిర్వహిస్తున్నారు. అయితే ప్రతీ బెల్ట్‌షాప్ నుంచి పోలీసులకు డబ్బులు ముడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బెల్ట్‌షాప్ నిర్వహకులపై చర్యలు తీసుకోవాలని ఆయా ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

గ్రామాల్లో బెల్ట్‌షాప్‌ల నిర్వహణ అంశం మాదృష్టిలో లేదు. ఫిర్యాదులు కూడా రావడం లేదు. ఎక్కడైనా బెల్ట్‌షాప్‌ల వలన లాఅండ్ ఆర్డర్ ఇబ్బంది తలెత్తితే తప్పక చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో బెల్ట్‌షాప్‌లు ఎవరూ ఏర్పాటు చేయరాదు. అది చట్టరీత్యా నేరం.

– కోల నరేష్, సీఐ, జైనథ్

సేవాలాల్ జయంతి విజయవంతం చేయండి


మాట్లాడుతున్న సురేష్ నాయక్

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో గురువారం నిర్వహించే సంత్ శ్రీసేవాలాల్ మహరాజ్ జయంతిని విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రాథోడ్ సురేష్ నాయక్ పిలుపునిచ్చారు. బుధవారం రాంలీలా మైదానంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉదయం 11 గంటలకు భోగ్ బంఢార్ కార్యక్రమం ఉంటుందన్నారు. జయంతి వేడుకలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. సమావేశంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు బలిరాం నాయక్, గోపాల్ నాయక్, జాదవ్ బాబులాల్, రామేశ్వర్, దీపక్, భీంరావు, ఆడే ప్రేం, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతికి తరలిరావాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో ఉత్సవాల నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని బుగ్గారంలో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు సతీష్, ఆడే వసంత్ రావు, కృష్ణనాయక్, జాదవ్ వసంత్‌రావు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన జెడ్పీచైర్మన్

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో గురువారం అధికారికంగా నిర్వహించనున్న సంత్ సేవాలాల్ జయంతి ఏర్పాట్లను జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్ బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు. బంజారా కులస్తులు తమ సంస్కృతి, సంప్రదాయాలను చాటాలన్నారు. కార్యక్రమంలో సేవాలాల్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సురేష్ రాథోడ్, ప్రధాన కార్యదర్శి పవర్ దేవిదాస్ జెడ్పీ డిప్యూటీ సీఈవో రాజేశ్వర్ రాథోడ్, జెడ్పీటీసీలు రాజు, సుధాకర్ పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

తలమడుగు: మండలంలోని కుచులపూర్ సాయిబాబా ఆలయ 27వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం సప్తవేడుకలు, అభిషేకం నిర్వహించారు. ఎంపీపీ కల్యాణం లక్ష్మి రాజేశ్వర్, సర్పంచ్ ప్రభ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆలయంలో వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య అభిషేకం, సప్త ప్రవచనలు నిర్వహించారు. 24న అన్నదానం, పల్లకి ఊరేగింపు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో విశాల్, గ్రామస్తులు రాజేశ్వర్, వీడీసీ చైర్మన్ దేవ్‌రావు, వామన్, రవీందర్, జక్కుల ప్రభాకర్ పాల్గొన్నారు.

జీవాలకు నట్టల నివారణ మందు వేయించాలి


నట్టాల నివారణ మందు వేస్తున్న బోథ్ ఎమ్మెల్యే

తలమడుగు: గ్రామాల్లో నిర్వహించే పశువైద్య శిబిరాల్లో గొర్రెలకు, మేకలకు నట్టాల నివారణ మందు వేయించాలని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కిషన్ అన్నారు. బుధవారం మండలంలోని దేవాపూర్‌లో పశువైద్య శిబిరం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫిబ్రవరి 28వరకు నట్టల నివారణ మందు వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యధికారి దూద్‌రామ్ రాథోడ్, సర్పంచ్ అబ్దులా సిబ్బంది స్వామి, సౌమ్య, విజేయ్, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఇచ్చోడ: మండలంలో గొర్రెలకు, మేకలకు ఉచితంగా నట్టాల నివారణ మందును పంపిణీ చేస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి గోవింద్ నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని బోరిగామలో 480 మేకలకు నట్టాల నివారణ మందు వేశారు. 23న దూబార్‌పేట్, ఇచ్చోడ, అడేగామ(కె), 24న పట్వారిగూడ, మాదపూర్, 25న గేర్జం, చింబోలి, ధర్మంపూరి, 26న సిరిచెల్మ, బావోజిపేట్, 27న సాథ్‌నంబర్, ముఖరా(బి), 28న గుండాల, కేశవట్నం, మేడిగూడ, గుండి గ్రామాల్లో నట్టాల నివారణ మందును పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ఆదిలాబాద్‌రూరల్: మూగజీవాల పెంపకందారులు ప్రభుత్వం అందిస్తున్న నట్టాల నివారణ మందును సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ గండ్రత్ రమేష్ సూచించారు. మండలంలోని యశ్వంత్‌గూడలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గొర్రెలు, మేకలకు నట్టాల నివారణ మందు పంపిణీ చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కుమ్ర విజయ లక్ష్మిరాజు, సర్పంచ్ దుర్వ రాంచందర్, ఉప సర్పంచ్ గంగారాం, జయంత్, పశువైద్యాధికారి సురేష్ పాల్గొన్నారు.

నేరడిగొండ: వ్యవసాయంతో పాటు రైతులు పశుపోషణపై దృష్టి సారించాలని జెడ్పీటీసీ అనిల్ జాదవ్ అన్నారు. మండల పరిధిలోని పశువైద్యశాలలో బుధవారం మేకలకు నట్టాల నివారణ మందు పంపిణీ చేశారు. అదనపు ఆదాయంతో పాటు పశువుల ఎరువు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సజన్, సర్పంచ్ పెంట వెంకటరమణ, డాక్టర్ సునీల్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నాయకుల ముందస్తు అరెస్టు


పోలీసుస్టేషన్‌లో బీజేపీ నాయకులు


పోలీసుల అదుపులో విద్యార్థి సంఘాల నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: బోథ్ మండల కేంద్రంలో రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు పర్యటన సందర్భంగా విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులను పోలీసులు బుధవారం ముందస్తు అరెస్టు చేసి, పోలీసుస్టేషన్‌కు తరలించారు. తెల్లవారుజామున విద్యార్థి సంఘాల జేఏసీ కన్వీనర్ బి.రాహుల్, ఆదివాసి విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి సలాం వరుణ్‌లను అదుపులోకి తీసుకున్నారు.

నేరడిగొండ: మండల బీజేపీ నాయకులను స్థానిక పోలీసులు ఉదయం 7 గంటలకు ముందస్తు అరెస్టు చేశారు. బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. పేదలకు డబుల్‌బెడ్ రూం ఇవ్వాలని, రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించాలని, కుప్టి ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేసి త్వరగా పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ వైఫల్యాలను కప్పి పుచ్చేందుకే పోలీసులతో ముందస్తు అరెస్టు చేసి తమ గొంతును నొక్కుతుందని అన్నారు. సాబ్లే సంతోష్ సింగ్, గిరిజన మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి తొడసం శంకర్, మండల ప్రధాన కార్యదర్శి సోలంకి ప్రశాంత్, బొంతుకుల శ్రీను ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల అరెస్టు

కాంగ్రెస్ నాయకులను ముందస్తు అరెస్ట్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. మండల అధ్యక్షుడు ఆడే వసంత్ రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేసి ప్రభుత్వ కార్యక్రమాలు చేసుకునే దుస్థితి నెలకొందన్నారు. అరెస్టు అయిన వారిలో జిల్లా నాయకులు ఏలేటి రాజశేఖర్ రెడ్డి, బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి ఎండీ సద్దాం ఉన్నారు.

ఇంద్రవెల్లి: తుడుందెబ్బ, అఖిల పక్షం నాయకులను ముందస్తు అరెస్ట్ చేయడం సరికాదని తుడుందెబ్బ జిల్లా కార్యదర్శి సోయం బాపురావు, బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు మరప రాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సోమోరే నాగోరావ్‌లు అన్నారు. సీఎం కేసీఆర్‌కు ఓటమి భయం పట్టుకుందన్నారు. తుడుందెబ్బ ఉట్నూర్ డివిజన్ అధ్యక్షుడు కోట్నాక్ భారిక్‌రావ్, సోమసే వెంకట్‌రావ్, దిలిప్ మోరే, రాజువర్ధాన్, దీపక్‌సింగ్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: ముందస్తు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) జిల్లా అధ్యక్షుడు గోడం గణేష్ అన్నారు. తమ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఉద్యమాలు చేస్తుంటే ప్రభుత్వం పోలీసులతో అరెస్టులు చేయిస్తుందని విమర్శించారు. భూపెల్లి శ్రీధర్, చరణ్‌గౌడ్, చంద్రశేఖర్, సెడ్మకి ఆనంద్‌రావ్‌లను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి, పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు.

తాంసి: పిప్పల్‌కోటి రిజర్వాయర్ నిర్మాణంలో భూములు ముంపుకు గురవుతున్న రైతులు పరిహారం కోసం ఆందోళన చేపడుతున్న విషయం తెలిసిందే. ఆందోళన చేస్తున్న రైతు సంఘం నాయకులను బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. నసీరుద్దీన్, స్వామిలను భీంపూర్ పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

'బీఆర్‌ఎస్ నాయకులకే డబుల్‌బెడ్‌రూం ఇళ్లు'


మాట్లాడుతున్న పాయల్ శంకర్

ఆదిలాబాద్‌రూరల్: బీఆర్‌ఎస్ నాయకులకే ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న డబుల్‌బెడ్‌రూం ఇళ్లను కేటాయించారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ ఆరోపించారు. బుధవారం మావల మండలంలోని బట్టిసావర్‌గాం, దుబ్బగూడలో నిర్వహించిన బీజేపీ శక్తికేంద్ర కార్నర్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో కనీస మౌలిక వసతులు కల్పించడంలో ఎమ్మెల్యే జోగు రామన్న విఫమయ్యారని విమర్శించారు. అర్హులైన దివ్యాంగులకు ఆసరా పింఛన్ మంజూరు చేయించలేకపోతున్నారని మండిపడ్డారు. దుబ్బగూడలో ఏకోపాధ్యాయ పాఠశాల మంజూరైనప్పటికీ కనీసం పక్కా భవనం నిర్మించి ఇవ్వలేక పోయారని అన్నారు. బీజేపీ నాయకులు గంగారెడ్డి, భార్గవ్, శ్రీనివాస్, రవి, ముకుంద్‌రావ్, భూమేష్, సతీష్ పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: మండలంలోని పోలింగ్ బూత్ 71, 72, 73లలో శక్తి కేంద్రం స్థాయి కార్నర్ మీటింగ్‌ను బీజేపీ మండల అధ్యక్షుడు కొలిపాక శేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఇందులో మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ పాల్గొని మాట్లాడారు. పార్టీ బలోపేతం, కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రసంగించారు. కార్యక్రమంలో నాయకులు సట్ల అశోక్, శ్రీరాంనాయక్, సంతోశ్‌రెడ్డి, వాసు, దేవిదాస్, నారాయణ్, నవీన్ రెడ్డి, నరేశ్, లింగన్న పాల్గొన్నారు.

బహిరంగ చర్చకు సిద్ధంగా ఉండాలి

ఆదిలాబాద్: బీఆర్‌ఎస్ నాయకులు బహిరంగ చర్చకు సిద్ధంగా ఉండాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి లోక ప్రవీణ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. జైనథ్ మండలం కంత గ్రామ రోడ్డు నిర్మాణాన్ని ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద చేపడుతుండగా.. ఎమ్మెల్యే జోగు రామన్న ఇటీవల భూమిపూజ చేసి ప్రారంభించారన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టే పనుల ప్రారంభోత్సవానికి ఎంపీ సోయం బాపురావును ఎందుకు పిలవలేదని ప్రశ్నించారు. ఇకనైనా బీఆర్‌ఎస్ నాయకులు విషయం తెలుసుకొని మాట్లాడాలన్నారు. సమావేశంలో నాయకులు మయూర్ చంద్రకాంత్, ఆశిశ్, సురేష్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీని సందర్శించిన డీఈవో


విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డీఈవో

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా విద్యాధికారి ప్రణీత బుధవారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. పరీక్షల సన్నద్ధతపై ఆరా తీశారు. పరీక్షల్లో విజయం సాధించేలా అనుసారించాల్సిన కార్యచరణపై పలు సూచనలు చేశారు. విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులు నివృత్తి చేయాలన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో దీప్తి, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బీఆర్‌ఎస్'

ఇచ్చోడ: జిల్లాలో మంత్రులు పర్యటిస్తే అక్రమంగా అరెస్టులు చేసి, టీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని తుడుందెబ్బ మండల అధ్యక్షుడు అత్రం మహేందర్ ఆరోపించారు. బుధవారం బోథ్ మండల కేంద్రంలో మంత్రుల పర్యటన సందర్భంగా ముందస్తు అరెస్టు చేశారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం హక్కులను కాలరాస్తుందని ఆరోపించారు. అరెస్టు అయిన వారిలో బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఘనంగా భీమన్న జాతర

బోథ్: మండలంలోని ధన్నూర్‌లో గ్రామంలో భీమన్న జాతరను బుధవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

పరామర్శ

బోథ్: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సల్ల రవి నానమ్మ ఇటీవల మృతి చెందగా కాంగ్రెస్ నాయకులు జాదవ్ నరేష్ బుధవారం పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు పసుల చంటి, మహమ్మద్, నజర్ అహ్మద్, అనిల్ కుమార్ ఉన్నారు.

చర్యలు తీసుకోవాలి

బోథ్: బోథ్ ఆసుపత్రి భవన నిర్మాణ శంకుస్థాపనకు తమను పిలవకుండా అవమానపరిచారని, అధికారులు ప్రోటోకాల్ పాటించలేదని కాంగ్రెస్ ఎంపీటీసీలు మహేందర్, షేక్ రజియా బేగంలు అన్నారు. ఈవిషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు 4చేస్తామన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

బోథ్: మండలంలోని సొనాల గ్రామానికి చెందిన ఒంటరి మహిళ సలిగంటి రజితకు తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ఇర్ల అభిలాష్ నిత్యావసర సరుకులు బుధవారం అందజేశారు. పేద ప్రజలకు అండగా ఉంటామని వారు తెలిపారు. కార్యక్రమంలో దండారి శ్రీకాంత్, కాని హరీష్, తుల అభిలాష్, ఉప్పు ఉదయ్‌కుమార్, లోక కార్తీక్ రెడ్డి, గౌతమ్‌రెడ్డి పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన

నేరడిగొండ: మండలంలోని అరెపల్లి గ్రామంలో ఈనెల 22 నుంచి 24వరకు జగదంబ సంత్ సేవాలాల్ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు బుధవారం ప్రారంభించారు. అనంతరం హనుమాన్ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ రాథోడ్ సజన్, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు నారాయణ్ సింగ్, కెవల్ సింగ్ ఉన్నారు.

సీపీఐఎంఎల్ ప్రజాపంథా ఆవిర్భావ వేడుకలు

ఎదులాపురం: సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఆవిర్భావ వేడుకలను బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. అమరులైన కమ్యూనిస్టులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో జగన్‌సింగ్, ఆత్రం వినోద్, సిడాం సాయికుమార్, వినోద్, అశోక్, గణేష్, గణేష్, రవి, హరీష్, విష్ణు, రాజు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి గ్రామ పంచాయతీ అభివృద్ధికి వార్డు సభ్యులు, ప్రజలు సహకరించాలని సర్పంచ్ కోరెంగా గాంధారి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ నిర్వహించి అభివృద్ధి పనులపై చర్చించారు. ఇప్పటికే పల్లెప్రగతి కార్యక్రమంలో భాగంగా సీసీరోడ్లు, మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. బెల్ట్‌షాపులను తొలగించాలని మండల కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్తలు మహ్మద్ జాబీర్, కాంబ్లే అతిష్, బాలేరావ్ భస్కార్, ఆచారే దత్తలు సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు. ఉప సర్పంచ్ తహరే గణేష్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వరల్డ్ థింకింగ్ డే వేడుకలు

ఆదిలాబాద్‌టౌన్: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో వరల్డ్ థింకింగ్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల నం.2 ప్రధానోపాధ్యాయుడు బచ్చన్‌సింగ్ ముఖ్య అతిథిగా హాజరై స్కౌట్స్ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో గిరిజన శాఖ క్రీడల అధికారి పార్థసారధి, స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా ఉపాధ్యక్షుడు దేవేందర్ పటాస్కర్, జిల్లా కార్యదర్శి నిర్వాన్ శాస్త్రి, నాగిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'బహుజనులపై కేసీఆర్ చిన్నచూపు'

జైనథ్: సీఎం కేసీఆర్‌కు బహుజనులు అంటే చిన్న చూపని, అందుకే ఎమ్మెల్యే సాయన్న అంత్యక్రియలను అధికారికంగా నిర్వహించలేదని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గడుగు మహేందర్ ఆరోపించారు. బుధవారం మండలంలోని మాండగాడ గ్రామంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. దుబ్బాక ఎమ్మెల్యే రామలింగారెడ్డి, నాగార్జున సాగర్ ఎమ్మెల్యే నోముల నరసింహయ్య మరణించినప్పుడు, సినీ ప్రముఖులు మరణించినప్పుడు అధికారికంగా అంత్యక్రియలు నిర్వహించడం జరిగిందన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యే సాయన్న అంత్యక్రియలు మాత్రం అధికారికంగా నిర్వహించకపోవడం, బహుజనులను అవమానించడమే అని అన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వెంకన్న బ్రహ్మోత్సవాలు


కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

తలమడుగు: మండలంలోని బరంపూర్‌లో శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను బుధవారం వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణ మధ్య హోమం, పూర్ణాహుతి, కల్యాణం, చక్రస్నానం, యజ్ఞం నిర్వహించారు. మాజీ ఎంపీ గోడం నగేశ్, మాజీ పాడి పరిశ్రమ చైర్మన్ లోక భూమారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.


పూజలు చేస్తున్న నాయకులు, భక్తులు